క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు

నెల్లూరు (పొగతోట): కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

1న అవార్డుల ప్రదానం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర స్థాయిలో వైద్య, న్యాయ, సామాజిక, కళారంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి సేవా పారాయణులు పురస్కారాలను ఫిబ్రవరి ఒకటిన అందజేయనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు ధ్రువీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఈ నెల 26లోపు పంపాలని, వివరాలకు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘురామిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని..

• భార్యపై దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదనే అక్కసుతో భార్యపై భర్త దాడి చేశారు. గాయపడిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన రేణుక, భాస్కర్ కొన్నేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. మద్యానికి బానిసైన భాస్కర్ పనికి వెళ్లేవారు కాదు. రేణుక కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించసాగారు. మద్యానికి డబ్బులివ్వాలని భాస్కర్ తరచూ భార్యను వేధించేవారు. ఆమె లేవని చెప్తే తీవ్రంగా కొట్టేవారు. ఈ నేపథ్యంలో మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని భార్యతో సోమవారం అర్ధరాత్రి గొడవపడి కత్తితో దాడి చేశారు. గాయపడిన ఆమె గట్టిగా కేకలేయడంతో అతను పరారయ్యారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో ఆమెను చేర్పించారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితురాలు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం

• జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ


కాలువను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

పొదలకూరు: ఎక్కడైనా ప్రజలు జ్వరాలతో బాధపడుతుంటే వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే ఏరియాలో ఐదుగురికి జ్వరాలున్నా వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

• ఎమ్మార్వో కాలనీలో గర్భిణులకు కో – లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత వైద్యపరీక్షలను నిర్వహించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, సుమాంజలి, కృష్ణమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు

మనుబోలు: 'బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. వాటిని ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు శిక్ష తప్పదు' అని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని పిడూరుపాళెం ఎస్టీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్‌ఎం ఇంద్రసేన, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• కొడవలూరు: బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై మండలంలోని యల్లాయపాళెం మజరా రెడ్డిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియజేయాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధమ్మ పాల్గొన్నారు.

గాంధీబొమ్మ సెంటర్‌లో గజిబిజిగా వాహనాలు




వాహనాల రద్దీ

ట్రాఫిక్ పద్మవ్యూహం

• నానాటికీ పెరుగుతున్న వాహనాలు
• రోడ్ల ఆక్రమణలతో కుచించుకుపోతున్న రహదారులు
• నగర రోడ్లపై నిత్యం అగచాట్లే

నెల్లూరు (పొగతోట): నానాటికీ పెరుగుతున్న వాహనాలు.. ఆక్రమణలతో కుచించుకుపోతున్న రహదారులు.. పార్కింగ్ సమస్య.. వెరసి నగరవాసులు నిరంతరం అగచాట్లకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలు నగరంలోకి వస్తుండటం సైతం సమస్యకు ఓ కారణమవుతోంది. పెరిగిన జనాభా.. వాహనాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ ఏళ్లుగా జరగలేదు.

నిరంతరం ఇంతే..

నగర జనాభా దాదాపు తొమ్మిది లక్షలకు చేరువవుతోంది. ఆత్మకూరు బస్టాండ్, పొగతోట, స్టోన్‌హౌస్‌పేట, విజయమహల్ గేట్ సెంటర్, కనకమహల్ సెంటర్, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ట్రంక్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు నిరంతర సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. మరోవైపు లెక్కకు మించిన ఆటోలకు అనుమతులిస్తున్నారు. వీటిని నడిపే వారు నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడ పడితే అక్కడ ఆపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ తరచూ స్తంభిస్తోంది.

ఎక్కడి వాహనాలు అక్కడే..

పార్కింగ్‌కు స్థలాల్లేకపోవడంతో వాహనాలను ఎక్కడ పడితే అక్కడే నిలుపుతున్నారు. పొగతోటలోని హాస్పిటళ్ల వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఫలితంగా విజయమహల్ గేట్ నుంచి ఎం – 1 థియేటర్లకు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ తరచూ స్తంభిస్తోంది. ప్రమాదానికి గురైన వారు, ఎమర్జెన్సీ కేసులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు నరకయాతనను అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు గతంలో ఉండేవారు. అయితే ప్రస్తుతం పత్తాలేకపోవడంతో వాహనదారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

మినీబైపాస్‌లోనూ ఇంతే..

మినీ బైపాస్‌లో రాత్రి వేళ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రోడ్డు పక్కన నిలిపేస్తున్నారు. ఆర్టీసీ బస్సులూ ఇక్కడే యూటర్న్ తీసుకుంటుండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. నగరంలో గతంలో వన్‌వేలుగా ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం తొలగించారు. ఏసీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు వన్ వే ఉన్నా, వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఇష్టానుసారంగా వస్తున్నా, ట్రాఫిక్ పోలీసులకు ఏ మాత్రం పట్టడంలేదు. టౌన్ సర్వీసులను రోడ్ల మధ్యలో ఉన్నట్లుండి నిలిపేస్తుండటంతో వెనుక వచ్చే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


శివాజీ సెంటర్‌లో బారులుదీరిన వాహనాలు


మద్రాస్ బస్టాండ్ వద్ద ఇదీ పరిస్థితి


యథేచ్ఛగా వాహనాల నిలిపివేత


కనకమహల్ సెంటర్‌లో ఇలా..

ట్రేడ్ లైసెన్స్‌లను విధిగా పొందాలి


సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని ఆస్పత్రులు, మెడికల్ షాపులు ట్రేడ్ లైసెన్స్‌లను విధిగా పొందాలని, లేని పక్షంలో వాటిని సీజ్ చేస్తామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని 45, 46వ డివిజన్లలో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న స్థానికులను గుర్తించి వారికి జరిమానాలను విధించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో పాత చెత్త కుండీల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. పొగతోటలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రణాళికబద్ధంగా జరిగేలా చూడాలని సూచించారు. రైల్వే అధికారులను సంప్రదించి ట్రాక్‌ను ఆనుకొని ఉన్న గోడకు పెయింటింగ్ పనులు చేయించాలన్నారు. రోడ్లను ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులు, ఆస్పత్రుల సూచికలు, ఇతర సైన్‌బోర్డులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఇందిరాభవన్ రోడ్డులోని అన్న క్యాంటిన్లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. విజయమహల్ గేట్ సమీపంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను తనిఖీ చేసి ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలిచ్చారు. కార్పొరేటర్ వేలూరు మహేష్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వసూలు చేయండి

పన్నుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.25 వేలకు మించి బకాయిలున్న వారి ఆస్తిని సీజ్ చేయాలని పేర్కొన్నారు. బకాయిలున్న ప్రతి ఒక్కరికీ నోటీసులను జారీ చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 31 నాటికి సాధించలేకపోతే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్టం మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వసూళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. నగరంలోని ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి డిమాండ్ నోటీసులను జారీ చేయాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

నేడూ, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరా ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవిందనగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, సింహపురి కాలనీ, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ రెండు రోజుల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు(అర్బన్): రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్ కన్వీనర్ అజయ్‌బాబు 111వసారి రక్తదానం చేశారు. నారాయణ ఆస్పత్రిలో ఒకరికి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో మద్రాస్ బస్టాండ్ సమీపంలోని బ్లడ్ బ్యాంక్‌లో కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్, జనరిక్ మెడికల్ షాపు కన్వీనర్ మురళీకృష్ణ, మహాయాగ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రెసిడెంట్ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ మంగళవారం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఈఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గానాల రామ్మూర్తికి నివాళి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా వ్యవహరించిన గానాల రామ్మూర్తి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాబు ఆచారి, శివప్రసాద్, చంద్ర, సురేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలి



నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళలకు శిక్షణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని డీపీఎం (ఐబీ) కామాక్షి సూచించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య ఈసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా సమాఖ్యకు నూతన కమిటీని నియమించామని, వివిధ అంశాలపై వీరికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

కాయిన్స్ ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పోను నగరంలో నిర్వహించనుండటాన్ని కలెక్టర్ ఆనంద్ అభినందించారు. పార్థసారథినగర్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాలలో ఈ నెల 25, 26న నిర్వహించనున్న కాయిన్స్ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు షణ్ముగ ఆచారి, వెంకటాద్రినాయుడు మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవాడ శ్రీధర్ అకాడమీ సౌజన్యంతో నిర్వహించనున్నామని చెప్పారు. అప్పుస్మా సంఘ నేతలు శ్రీధర్, కృష్ణారావు పాల్గొన్నారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

నెల్లూరు(క్రైమ్): అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులను విస్తృతం చేశారు. ఇందులో భాగంగా స్టోన్‌హౌస్‌పేటలోని జీనిగాలవీధిలో ఓ ఇంటిపై మంగళవారం దాడులు జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.17.35 లక్షల విలువజేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ గోదాములో రూ.లక్షల విలువజేసే పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. సరుకుకు సంబంధించిన బిల్లులను గోదాము నిర్వాహకుడు చూపడంతో వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాన్, డీసీటీఓ విష్ణురావు, ఏఓ యానాది తదితరులు పాల్గొన్నారు.

ఏడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్లో ఏడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ పేర్కొన్నారు. నగరంలోని డీఆర్డీఏ సబ్‌స్టేషన్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.పది లక్షలవుతుందని, ఈ క్రమంలో రూ.70 లక్షలతో వీటిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సిబ్బంది వారి పరిధిలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పీఎం సోలార్ విద్యుత్, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. డీఈఈ అశోక్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.